క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కుత్బుల్లాపూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్ మండల వైద్యాధికారి నిర్మల తెలిపారు. సూరారం కాలనీలోని యూపీహెచ్‌సీలో జ్వరంతో బాధపడుతున్న 16 మందికి టెస్టులు చేసి వారికి మందులు పంపిణీ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో జ్వరం వాంతులు, విరోచనాలు ఇతరత్రా జ్వరాలతో బాధపడేవారు తప్పక ఆసుపత్రికి వెళ్లాలని కోరారు.

పంట పొలాల వివరాలను నమోదు చేయించుకోవాలి


పంట వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారి మాధవరెడ్డి

దుండిగల్: వానాకాలం నేపథ్యంలో మండల వ్యవసాయ అధికారులు పంటల వివరాలను నమోదు చేసే పనిలో పడ్డారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో దాదాపు 900 ఎకరాల్లో పంట సాగు, 200 ఎకరాల్లో ఉద్యానవన పంటలు పండిస్తున్నారు. సదరు పంటల వివరాలను మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. ప్రతిఒక్క రైతు తమ పంట పొలాల వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్: 7288894684లో సంప్రదించాలని కోరారు.

అమ్మవారికి బంగారు ముక్కుపుడక సమర్పణ


ముక్కుపుడక, కలశం, వెండి ముఖం అందజేస్తున్న సురేష్‌రెడ్డి, శ్వేత దంపతులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో కొలువైన రేణుకాఎల్లమ్మ అమ్మవారికి నరేష్‌రెడ్డి, శ్వేత దంపతులు సోమవారం లక్ష రూపాయల విలువ చేసే ముక్కుపుడక, పూల హారం, కలశం, అమ్మవారి వెండి ముఖం బహూకరించారు. అనంతరం అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు నరేష్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

పైపులైన్ పనులు ప్రారంభం


ఎస్సీ కాలనీలో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ జ్యోతిరెడ్డి

నిజాంపేట్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ ఎల్లంబాయి జ్యోతిరెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ ఎస్సీ కాలనీలో 160 ఎంఎం హెచ్‌డీ తాగునీటి పైపులైన్ పనులను ఆమె ప్రారంభించారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరుస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బండారి లేఅవుట్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీకాంతారావు, ప్రధాన కార్యదర్శి విజయ రవీంద్రాబాబు, జలమండలి అధికారి సాయిరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలి



నిజాంపేట్: కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీలారెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో వీధి దీపాలు, హైమాస్ట్ లైట్లు సక్రమంగా వెలిగేలా చూడాలన్నారు. మరమ్మతులకు వచ్చిన వాటిని మార్చి కొత్త వాటిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ రామకృష్ణ రావు, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉన్నటుండి కుమ్మేసింది..


కుత్బుల్లాపూర్ గ్రామంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

సోమవారం సాయంత్రం దంచి కొట్టిన వానతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్‌లోని పలు ఇళ్లల్లోకి వరద నీరు ప్రవేశించడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జోరువానతో వాహనదారులు, పాదచారులు తడిసి ముద్దయ్యారు.

– కుత్బుల్లాపూర్


అయోధ్యనగర్‌లో వీధులను ముంచెత్తిన వరదనీరు

అధికారంలోకి రాగానే రేషన్‌కార్డ్, పెన్షన్, ఇళ్లు ఇస్తాం

కుత్బుల్లాపూర్: తొమ్మిదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వకుండా మోసం చేస్తూ వచ్చిందని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం సూరారం డివిజన్ సంజయ్ గాంధీనగర్‌లో అర్హులైన నిరుపేదల నుంచి బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం చేపట్టారు.

◆ ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... మోసపూరిత హామీలతో ఇన్నాళ్లు సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ వచ్చారన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు అందిస్తామన్నారు. కేంద్రం నిధులిచ్చినా రాష్ట్ర ప్రభుత్వం నిధులను పక్కదారి పట్టించి ప్రజలను నట్టేట ముంచిందన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో డబుల్ ఇళ్లు శిథిలావస్థకు చేరాయని అన్నారు. వాటిని వెంటనే పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

◆ ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దుర్యోధనరావు, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్‌రెడ్డి, బావిగడ్డ రవి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చండీ శ్రీనివాస్, పత్తి రఘుపతి, సురేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి రాజేష్ మిశ్రా, మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు సంగీత పాత్ర, సంతోష్‌గుప్తా, నాగరాజు తదితర నేతలు పాల్గొన్నారు.


సంజయ్‌గాంధీ నగర్‌లో డబుల్ బెడ్‌రూమ్ దరఖాస్తులను స్వీకరిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

'డబుల్' ఇళ్లు ఇవ్వకుండా ప్రభుత్వం మోసం చేస్తోంది : ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నంత వరకు డబుల్ బెడ్‌రూమ్‌లను ఇవ్వకుండా పేద ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. సోమవారం మేరకు దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలో స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం లక్షల్లో దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఇంకా ఎన్నో లక్షల మంది సొంత గూడు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిరుపేదల నుంచి దరఖాస్తులను స్వీకరించి కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపిస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అందరికి ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నా కార్యక్రమానికి బీజేపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, శ్యామ్, శ్రీనివాస్, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


డి.పోచంపల్లిలో స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న బీజేపీ నేత ఎస్.మల్లారెడ్డి

డ్రోన్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు మెండు

- దీఆర్‌డీఓ డైరెక్టర్ శివప్రసాద్ పర్వతనేని

దుండిగల్: మారుతున్న కాలానుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని డీఆర్‌డీఓ డైరెక్టర్ శివప్రసాద్ పర్వతనేని అన్నారు. ఎంఎల్‌ఆర్‌ఐటీ ఏరోనాటికల్ ఇంజినీరింగ్ విభాగం, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సంయుక్త ఆధ్వర్యంలో నాలుగు వారాల పాటు డ్రోన్లపై టెక్నాలజీ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. అందుకు దుండిగల్‌లోని ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాల వేదికగా మారింది.

◆ ఈ కార్యక్రమాన్ని శివప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. వ్యవసాయం, నిర్మాణాల నుంచి లాజిస్టిక్స్, అత్యవసర సేవల వరకు డ్రోన్లను ఉపయోగిస్తున్నారని, డ్రోన్ పరిశ్రమ గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తోందన్నారు. డ్రోన్లతో మారుమూల ప్రాంతాలల్లో వైద్య సామగ్రిని పంపిణీ చేయడం, పర్యావరణ మార్పులను పర్యవేక్షించవచ్చారు. అదే విధంగా ఔత్సాహికులు, ఉపాధ్యాయులకు చాలా ఉపయోగం ఉంటుందని తెలిపారు.

◆ అనంతరం కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్లిష్ట నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లను నావిగేట్ చేయడంలో మార్గదర్శకత్వం, సహాయాన్ని అందిస్తుందన్నారు. వర్క్‌షాప్ ఫలితాలు డ్రోన్ టెక్నాలజీ, దాని విభిన్న అప్లికేషన్లు, రెగ్యులేటరీ, చట్టపరమైన పరిగణనలు, మార్కెట్ పరిశోధన, వ్యాపార అవకాశాలు, ఆచరణీయ వ్యాపార నమూనాను రూపొందించడం, ఉత్పత్తి రూపకల్పన తదితర అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు, వివిధ విభాగాల అధిపతులు సత్యనారాయణ గుప్తా, రాధికాదేవి తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీఓ డైరెక్టర్ శివప్రసాద్




ఘనంగా మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు

రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. శంభీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు కేక్ కట్ చేయగా, చింతల్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వివేకానంద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

– కుత్బుల్లాపూర్

ఫ్యూజ్‌బాక్స్‌కు మూతలేదు.. అధికారులకు సోయిలేదు!

రంగారెడ్డినగర్: మూతల్లేని ఫ్యూజ్‌బాక్స్‌లతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వాటి నిర్వహణ చేపట్టాల్సిన సంబంధిత శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి విజయనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో ఉన్న విద్యుత్ ఫ్యూజ్ బాక్స్‌కు మూత లేకపోవడంతో పాటు విద్యుత్ వైర్ రోడ్డుపై వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. తక్కువ ఎత్తులో ఉన్న ఫ్యూజ్‌బాక్స్‌తో తమ పిల్లలు ప్రమాదవశాత్తు పట్టుకునే అవకాశముందని, వెంటనే విద్యుత్ అధికారులు మూత ఏర్పాటు చేయడంతో పాటు వేలాడుతున్న విద్యుత్ వైర్‌ను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


విజయనగర్ కాలనీ ప్రధాన రోడ్డులో ఇలా..

గుర్రం జాషువాకు నివాళి

రాయదుర్గం: కులమతాలులేని విశ్వమానవతను ఆకాంక్షించిన కవులలో ఒకరు గుర్రం జాషువా అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆర్‌ఎస్ సర్రాజు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ తెలుగు విభాగంలో తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో గుర్రంజాషువా 51వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాషువా భారతీయ సంస్కృతిని, దానిలో తెలుగు వారి ప్రత్యేకతలను వివరించిన వ్యక్తి అని గుర్తుచేశారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. గుర్రం జాషువా భారతమాత గురించి వర్ణించినంత ఔనత్యాన్ని మరేకవి వర్ణించలేదని పేర్కొన్నారు.

ఒక్కసారిగా కుంగిన భూమి

సుభాష్‌నగర్: నాలుగు రోజులుగా వరుసగా కురిసిన వర్షాలకు ఇక్కడ ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. 44వ జాతీయ రహదారి జీడిమెట్ల విలేజ్ నుంచి షాపూర్‌నగర్‌కు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో సోమవారం ఒక్కసారిగా భూమి కుంగింది. 44వ జాతీయ రహదారి నుంచి సుభాష్‌నగర్ వరకు 30 సంవత్సరాల క్రితం వేసిన నాలా ఉంది.

◆ ఈనెల 10న చిన్న రంధ్రం పడగా, స్థానికంగా ఉన్న వ్యక్తి ఈనెల 12న అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే రోజు అధికారులు పరిశీలించి అప్రూవల్ కోసమని చుట్టూ బారికేడ్‌లు అమర్చి వెనుతిరిగారు. ఇటీవల కురిసిన వర్షానికి సోమవారం మధ్యాహ్నం 2 మీటర్ల లోతు 3 మీటర్ల వెడల్పులతో భూమి కుంగి భారీ గొయ్యి ఏర్పడింది.

◆ దీంతో అక్కడున్న దుకాణాలను యజమానులు మూసివేశారు. రెండు షాపులు ఒక పక్కన స్వల్పంగా ఒరిగాయి. మూడేళ్ల క్రితం ఈ రోడ్డు ఇదే మాదిరిగా కుంగిపోయింది. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.


భూమి కుంగిపోవడంతో స్వల్పంగా ఒరిగిన ఓ దుకాణం

కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతి

గచ్చిబౌలి: గచ్చిబౌలి ఓఆర్ఆర్ జంక్షన్ నుంచి కొండాపూర్ వైపు వాహనాల రాకపోకలకు అనుమతించారు. సోమవారం రాత్రి సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ హర్షవర్ధన్ వాహనాల రాకపోకలకు ప్రారంభించారు. గచ్చిబౌలి జంక్షన్‌లో ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్ రోడ్డులో రాడిసన్ హోటల్ వరకు లెవల్–2 ఫ్లైఓవర్ నిర్మాణం పనులు చేపడుతున్నారు.నిర్మాణ పనులకు అంతరాయం కలుగకుండా, ప్రయాణికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో మే 13 నుంచి కొండాపూర్ రోడ్డులో రెండు వైపుల వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఆగస్టు 10వ తేదీ వరకు గచ్చిబౌలి జంక్షన్ నుంచి కొత్తగూడ వైపు వెళ్ల రోడ్డును రెండు వైపులా మూసివేస్తున్నట్లు ఇప్పటికే ప్రకటించినా తాజాగా గచ్చిబౌలి నుంచి కొండాపూర్ వైపు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతించారు. కొండాపూర్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు వాహనాల రాకపోకలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు.

కళాశాలలో ఐదు సబ్జెక్ట్‌ల సిలబస్ పూర్తి కాలేదు

- ఇంటర్ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన
- బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ కళాశాల వద్ద ఏబీవీపీ నిరసన
- వెంటనే టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్


ఏబీవీపీ నాయకులు, విద్యార్థులపై లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు


బహదూర్‌పల్లి చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

సుభాష్‌నగర్: బోధనా సిబ్బంది లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపిస్తూ ఏబీవీపీ దుండిగల్ నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సంద్భంగా కూకట్‌పల్లి విభాగ్ కన్వీనర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆత్మకూరు శ్రీనాథ్ మాట్లాడుతూ.. సంవత్సర కాలంగా ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు ఒకటి, రెండు సబ్జెక్టులకు మాత్రమే తరగతులు నిర్వహించడంతో మిగతా ఐదు సబ్జెక్టుల సిలబస్ పూర్తి కాలేదన్నారు. మొదటి సంవత్సర విద్యార్థులకు తరగతులు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా సబ్జెక్టుల బోధన చేయడం లేదని ఆరోపించారు.

◆ ఈ విషయమై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ కమిషనర్‌కు పలు దఫాలుగా వినతులు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యార్థులు సబ్జెక్ట్‌ల విషయమై ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని అన్నారు. పోలీస్ కేసులు పెడతామంటున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్‌లు నిలిచిపోయాయని తెలిపారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలలో వెంటనే టీచింగ్, నాన్ టీచింగ్ పోస్ట్‌లను భర్తీ చేయాలన్నారు. ఆందోళన చేపట్టిన ఏబీవీపీ నాయకులను, విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు.

మళ్లీ తొలిమెట్టు..!



- విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంచేలా కార్యాచరణ
- 28 నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ
- బేస్‌లైన్ పరీక్షతో సామర్థ్యం అంచనా వేస్తున్న విద్యాశాఖ
- తదనుగుణంగా తొలిమెట్టుపై ప్రత్యేక చర్యలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడం, గణితంలో నాలుగు ప్రక్రియలకు సంబంధించిన లెక్కలు చేసేలా కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు గతేడాది పాఠశాల విద్యాశాఖ తొలిమెట్టు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా కొనసాగించి ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలను పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కోవిడ్ –19 కారణంగా బడుల్లో చదువులు ఆగిపోవడంతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం తగ్గింది. తిరిగి సామర్థ్యం పెంపొందించేలా తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేసింది. ఈ కార్యక్రమం అమలుతో గతేడాది చాలా వరకు ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటారు. అందుకే ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమం కొనసాగించేందుకు ఎస్సీఈఆర్టీ నిర్ణయించింది. సక్రమంగా అమలు చేసేందుకు మరోసారి ఉపాధ్యాయులకు జిల్లా, మండల స్థాయిలో శిక్షణ ఇచ్చేలా కార్యాచరణ రూపొందించింది.

మూడు విడతల్లో శిక్షణ

గత విద్యా సంవత్సరం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు జూలై, ఆగస్టు నెలల్లో ఉపాధ్యాయులకు మూడు విడతల్లో శిక్షణ ఇచ్చి ఆగస్టు 15 నుంచి అమలు చేశారు. భాషా, గణిత సామర్థ్యాల సాధనకు శ్రీకారం చుట్టి విద్యా సంవత్సరం ముగిసే వరకు అమలు చేశారు. విద్యార్థులకు ప్రణాళిక ప్రకారం బోధనాభ్యసన కార్యక్రమాలను రూపొందించి పక్కాగా అమలు చేశారు.

ప్రారంభ పరీక్షతో అంచనా

తొలిమెట్టు అమలులో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలల్లో చదువుతున్న 2వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ప్రారంభ పరీక్ష నిర్వహించి అభ్యసన సామర్థ్యాల స్థాయిని అంచనా వేశారు. ఎస్సీఈఆర్టీ గతేడాది రూపొందించిన ప్రశ్నపత్రాలతో ప్రారంభ పరీక్ష నిర్వహించారు. తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు ఈ పరీక్ష నిర్వహించారు. విద్యార్థులు కనబర్చిన సామర్థ్యాల ఆధారంగా అవసరమైన ప్రణాళిక రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

26 వరకు జిల్లాస్థాయిలో శిక్షణ

తొలిమెట్టు కార్యక్రమాన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు చేసేందుకు ఉపాధ్యాయులకు మళ్లీ శిక్షణ ఇచ్చేందుకు ఎస్సీఈఆర్టీ కార్యాచరణ రూపొందించింది. 1 నుంచి 5 తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. మండల స్థాయిలో తెలుగు, ఆంగ్లం, గణితంలో ఒక్కో సబ్జెక్టుకు ఇద్దరు వంతున ఆరుగురిని ఎంపిక చేసి ఈ నెల 24, 25, 26 తేదీల్లో జిల్లాస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు. వీరి శిక్షణ ముగిసిన తర్వాత మండల స్థాయిలో ఈ నెల 28 నుంచి ఒక్కో సబ్జెక్టుకు రెండు రోజులు వంతున శిక్షణ ఇవ్వనున్నారు.

సత్ఫలితాలు సాధిస్తాం

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు కనీస అభ్యసన సామర్థ్యాలు కలిగి ఉండేలా అమలు చేస్తున్న తొలిమెట్టు సత్ఫలితాలనిచ్చింది. రెండో విడతగా ఈ ఏడాది అమలు చేసి ఉత్తమ ఫలితాలను సాధించేందుకు శ్రద్ధ తీసుకుంటాం. ఈ నెల 28 నుంచి మండల స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.